సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 24 । నవంబర్ । 2024



సేంద్రియ ఎరువుల నిల్వ

సేంద్రియ ఎరువులు తక్కువ ధరకు లభిస్తుండటంతో పనువు రైతులు ముందస్తుగా కొను గోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు.

- 8లో ▸



కుటుంబ నియంత్రణలో..

కుటుంబ నియంత్రణలో పురుషుల భాగ స్వామ్యం పెంచాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.0 /12.4

వాతావరణం

ఉదయం చలిగా ఉంటుంది. ఆకాశం పాక్షి కంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

గడుగును సన్మానించిన ఆదర్శ రైతులు



నిజామాబాద్ సిటీ : రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్‌ను ఆదర్శ రైతు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం జిల్లా కేంద్రంలోని గడుగు నివాసానికి పలు జిల్లాల నుంచి ఆదర్శ రైతు నాయకులు వచ్చారు. గడుగు గంగాధర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. గడుగు గంగాధర్ ఆదర్శ రైతులను సన్మానించారు. కరీంనగర్, కామారెడ్డి, నల్గొండ, వరంగల్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఆదర్శ రైతులు కె లింగన్న యాదవ్, వెంకటేశ్వర్‌రావు, రామిరెడ్డి, కోటేశ్వర్‌రావు, ప్రమోద్‌రెడ్డి కలిశారు. అనంతరం రైతుబజార్ ఎన్జీవోస్ కాలనీ యువజన సంఘం సభులు గడుగును సన్మానించారు.

ఎమ్మెల్సీ ఓటర్ల ముసాయిదా విడుదల

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని టీచర్లు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ముసాయిదా జాబితాను శనివారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు విడుదల చేశారు. డిసెంబర్ 9లోపు ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఆర్డీవో, తహసీల్ కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు. డిసెంబర్ 30న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం ఓటర్ల ముసాయిదా ప్రకారం జిల్లాలో టీచర్లు 3199 మంది ఉన్నారు. ఇందులో పురుషులు1947, మహిళలు1252 మంది ఉన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం ఓటర్లు 27110 మంది ఉండగా ఇందులో 17237 మంది పురుషులు, 9873 మంది మహిళలు ఉన్నారు.

మహిళా సంఘాల సంఖ్యను పెంచాలి

- డీఆర్‌డీవో సాయాగౌడ్



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో మహిళా సంఘాలను పెంచాలని, కొత్త వారిని గుర్తించి గ్రూపుల్లో చేర్చాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షులతో జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా శక్తి కార్యక్రమాలపై చర్చించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా ఎస్‌హెచ్‌జీలకు రుణాలు అందించి లక్ష్యాలను పూర్తి చేయాలని సాయాగౌడ్ సూచించారు. రుణాలతో వ్యాపారాలు స్థాపించి ఆర్థికంగా స్థిరపడేలా మహిళలను ప్రోత్సహించాలన్నారు. మండల, గ్రామ సంఘాల ఆడిట్ గురించి వివరాలు తెలుసుకున్నారు. ఇందులో సెర్ప్ అధికారి భారతి, డీపీఎంలు సంధ్యారాణి, సాయిలు, శ్రీనివాస్, మారుతి, స్త్రీనిధి ఆర్ఎం రాందాస్, ఏపీఎం సరోజిని, జిల్లా సమాఖ్య అధ్యక్షులు రాధ, కార్యదర్శి లావణ్య, కోశాధికారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాక్సిన్ సకాలంలో వేయాలి

జక్రాన్‌పల్లి: చిన్నపిల్లలకు వ్యాధులు సోకకుండా వ్యాక్సిన్లను సకాలంలో వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి అశోక్ సిబ్బందికి సూచించారు. జక్రాన్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని చాంద్‌మియాబాగ్‌లో వ్యాక్సినేషన్ కార్యకమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. బుధ, శనివారాల్లో వ్యాక్సిన్లను వేయించాలన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్ సాయి, ఏఎన్ఎం సుమలత, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.



దివంగత సీఎం వైఎస్ఆర్ నుంచి ఇండియన్ పోలీస్ మెడల్ అందుకుంటున్న కిషన్



అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య నుంచి ఉత్తమ సేవాపతకం అందుకుంటూ..



ఆయుధాలపై పోలీసు అకాడమీలో శిక్షణ ఇస్తూ..

అలుపెరగని శిక్షకుడు !

- 38 ఏళ్ల సర్వీసులో 30 ఏళ్ల పాటు..
- ఎస్ఐ, డీఎస్పీ, ఐపీఎస్‌లకు వివిధ అంశాల్లో శిక్షణ
- ఆయుధాలు, ఎక్స్‌ప్లోజివ్స్, యుద్ధతంత్ర, మ్యాప్ రీడింగ్ తదితరాల్లో తర్ఫీదు
- శిక్షణ అంశాలపై పలు రచనలు
- ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ సాధించిన ఘనత
- రిటైర్మెంట్ తర్వాత గత పదేళ్లుగా యోగా శిక్షకుడిగా..
- ఇంపాక్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెమరీ స్కిల్స్, పరీక్షల సన్నద్ధతపై మార్గదర్శనం
- నిత్య విద్యార్థిగా ఆయుష్ ద్వారా యోగాలో ఉన్నత కోర్సుల అభ్యసన
- కానిస్టేబుల్‌గా కెరీర్ ప్రారంభించి సీఐగా పదవీ విరమణ చేసిన కిషన్ సేవలు అజరామరం



కిషన్

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శిక్షణ ఇచ్చేందుకే పుట్టినట్లుగా తుది శ్వాస వరకు శిక్షణ ఇస్తూనే ఉంటానంటున్నారు ఈ రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ జిలకర కిషన్. నిజామాబాద్‌కు చెందిన ఈయన కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరినప్పటికీ తనకున్న ప్రతిభాపాటవాలతో కానిస్టేబుళ్ల నుంచి ఎస్ఐ, గ్రూప్–1, ఐపీఎస్ అధికారుల వరకు వివిధ రకాల వృత్తిపరమైన శిక్షణలు ఇస్తూ వచ్చారు. 1977లో ఉద్యోగంలో చేరిన కిషన్ 1984 నుంచి క్యాడర్ కోర్సుల్లో పోలీసులకు అకాడమీలో శిక్షణ ఇస్తూ వచ్చారు. తన 38 ఏళ్ల సర్వీసులో 30 ఏళ్లు అకాడమీలో శిక్షణ ఇస్తూనే సర్వీసు నుంచి రిటైర్ అయ్యారు. శిక్షణ ఇస్తున్న క్రమంలోనే హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ, ఎస్ఐ, ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతులు పొందారు. శిక్షణ ఇవ్వడమే శ్వాసగా భావిస్తున్న కిషన్ వద్ద పలువురు ఐపీఎస్‌లు అనేక అంశాలు నేర్చుకున్నారు. చాలామంది ఐపీఎస్‌లు, డీజీపీలుగా ఉన్నవారు సైతం కిషన్‌ను ఇప్పటికీ గౌరవపూర్వకంగా చూస్తుండడం విశేషం. పోలీసు శిక్షణ ఇవ్వడంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే టాప్ ఇన్‌స్ట్రక్టర్‌గా నిలిచారు. రిటైరయ్యాక సైతం కిషన్ అలుపెరగకుండా గత పదేళ్లుగా యోగా శిక్షణ ఇస్తూ వస్తున్నారు.



పోలీసు అకాడమీలో శిక్షణ ఇస్తూ..


రాసిన పుస్తకాలు.. గీసిన చిత్రాలు..

తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లో ముత్యాల్లాంటి అక్షరాలు రాసే కిషన్ చేతితో చిత్రాలు గీయడంలోనూ దిట్ట. ఈ క్రమంలో కిషన్ పోలీసు శిక్షణ కోసం అవసరమైన పుస్తకాలు రాశారు. కొన్ని తెలుగులోకి తర్జుమా చేశారు. అన్నింటికీ సంబంధించి పెన్నుతోనే అనేక చిత్రాలు గీశారు. ఆయుధాల విడిభాగాలను చేతితోనే అద్భుతంగా చిత్రించారు. పోలీసులకు అకాడమీలో యోగా తరగతులు నిర్వహించారు. కిషన్ రాసిన యోగా పుస్తకాలు, ఆయుధాల వాడకం, అన్నిరకాల డ్రిల్స్, ఆయుధాలు, ఫైరింగ్ విషయమై హ్యాండ్ బుక్ రాశారు. అవుట్‌డోర్ హ్యాండ్ బుక్ ఆఫ్ ట్రెనర్స్, పోలీసు స్టేషన్ల రక్షణ అంశాలపై రాసిన పుస్తకాలు అకాడమీ లైబ్రరీలో ఉంచారు. ఇక ఆయుధాల నిర్వహణ(ఆంగ్లం నుంచి తెలుగుకు తర్జుమా) చేశారు.

ఆయుధాలు వాడడంలో..

హిందీ, ఇంగ్లిష్ భాషలలో దిట్ట అయిన కిషన్ 1984 నుంచి 2015 వరకు పోలీసులకు క్యాడర్ శిక్షణ ఇచ్చారు. ఇండోర్ (మధ్యప్రదేశ్)లోని సెంట్రల్ స్కూల్ ఆఫ్ వెపన్స్ అండ్ టాక్టిక్స్‌లో, చెన్నైలోని సీఆర్‌పీఎఫ్ విభాగంలో ఎక్స్‌ప్లోజివ్స్ కోర్సు, టేకన్‌పూర్(మధ్యప్రదేశ్)లోని బోర్డర్ సెక్యూరిటీ విభాగంలోని టియర్ స్మోక్ యూనిట్‌లో కోర్సు నేర్చుకున్న కిషన్ తెలుగు రాష్ట్రాలకే ప్రత్యేకమైన గ్రేహౌండ్స్ శిక్షణలో రాటుదేలారు. అలాగే ముంబైలో జీబ్యాక్ శిక్షణ తీసుకున్నారు. 1980లో అసోం, నాగాలాండ్, మణిపూర్ రాష్ట్రాల్లో ఏడాది పాటు పనిచేశారు. 2011లో పంజాబ్, ఉత్తరప్రదేశ్‌ల్లో అడ్మిన్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్నికల విధులు నిర్వహించారు.

అన్ని విభాగాల్లో పట్టు సాధిస్తూ వచ్చిన కిషన్ హైదరాబాద్‌లోని పోలీసు అకాడమీలో 30 ఏళ్ల కాలంలో పలు కానిస్టేబుల్, ఎస్ఐ బ్యాచ్‌లకు చెందిన 10 వేల మందికి శిక్షణ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 110 మంది గ్రూప్–1(డీఎస్పీ)లకు, సుమారు 50 మంది తెలుగు రాష్ట్రాల క్యాడర్ ఐపీఎస్‌లకు పూర్తి శిక్షణ ఇచ్చారు. మరో 50 మంది బీహార్, త్రిపుర, లక్షద్వీప్‌లకు చెందిన డీఎస్పీలకు శిక్షణ ఇచ్చారు. బీహార్ డీఎస్పీలకు నక్సల్స్ ఆపరేషన్లపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. అన్నిరకాల ఆయుధాల వాడకం, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, యుద్ధతంత్ర కళ, ఎక్స్‌ప్లోజివ్స్(భారీ పేలుడు పదార్థాల డిస్పోజ్) తదితరాలపై శిక్షణ ఇచ్చారు. సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌ల ద్వారా కన్వెన్షనల్ సైన్స్‌లో శిక్షణ పొందిన కిషన్‌కు ఈ అంశంలో హెలీకాప్టర్ ఎక్కి చూసేవారి కంటే ఎక్కువ పరిజ్ఞానం ఉండడం విశేషం.



కిషన్ రచించిన పుస్తకాల్లోని చేతితో అద్భుతంగా గీసిన గ్రెనేడ్ మ్యాప్

ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డు..

కిషన్ సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రపతి సంతకంతో కూడిక ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నతమైన ఉత్తమ సేవా పతకం, సైన్య సేవా మెడల్ (ఇతర రాష్ట్రాల్లో కంటిన్యూగా ఏడాది పాటు సేవ చేస్తే ఇచ్చే పతకం.. అసోం, నాగాలాండ్, మణిపూర్‌లో పనిచేసినందుకు) వరించాయి. ముఖ్యమంత్రులు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య నుంచి పతకాలు అందుకున్నారు. ఎస్పీ నుంచి డీజీపీ వరకు అధికారుల నుంచి కిషన్‌కు 25 ప్రశంసా పత్రాలు వచ్చాయి.

రిటైరయ్యాక సెకండ్ ఇన్నింగ్స్..

తన 38 ఏళ్ల సర్వీసులో 30 ఏళ్ల పాటు అకాడమీలో శిక్షణ ఇచ్చిన కిషన్ రిటైరయ్యాక సెకండ్ ఇన్నింగ్స్ కొనసాగిస్తున్నారు. ఉద్యోగంలో చేరకముందే తాను నేర్చుకున్న యోగా శిక్షణను 2000 సంవత్సరం నుంచి ఇస్తున్నారు. ఇందులో భాగంగా పోలీసు అకాడమీలో 1000 మందికి యోగా శిక్షణ ఇచ్చారు. రిటైరయ్యాక హరిద్వార్‌లోని పతంజలి సంస్థలో మరింతగా యోగా శిక్షణ తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్ విభాగం నుంచి ఎల్–1, ఎల్–2, ఎల్–3 కోర్సులు పూర్తి చేసి ప్రస్తుతం నేరుగా ఎల్–6 యోగా కోర్సు ఆన్‌లైన్ ద్వారా నేర్చుకుంటున్నారు. నిజామాబాద్‌లో పోలీసు హెడ్‌క్వార్టర్స్‌తో పాటు వివిధ యోగా కేంద్రాల్లో ప్రతి ఉదయం యోగా నేర్పుతున్నారు. ఇక యోగా థెరపీ ద్వారా చాలామందికి క్యాన్సర్, షుగర్, బీపీ, కీళ్లనొప్పుల చికిత్స చేశారు. మరోవైపు విద్యార్థులకు ఇంపాక్ట్ ద్వారా ప్రతి ఏటా 20 ప్రభుత్వ పాఠశాలల్లో మెమరీ స్కిల్స్, పరీక్షల సన్నద్ధతపై శిక్షణ ఇస్తున్నారు.



అకాడమీలో పోలీసులకు యోగా శిక్షణ..

బీజేపీ సంబరాలు..

సుభాష్‌నగర్: రాబోయే ఎన్నికల్లో మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు పట్టిన గతే తెలంగాణలో కూడా పడుతుందని, అవే ఫలితాలు పునరావృతం అవుతాయని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయం సాధించడంపై బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తాలో విజయోత్సవాలు నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి మిఠాయిలు పంచుకున్నారు. టపాకాయలు కాల్చారు. ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ మహారాష్ట్ర ఫలితాలతో సీఎం రేవంత్‌రెడ్డికి కుర్చీ భయం పట్టుకుందన్నారు. మహారాష్ట్ర ప్రభావం తెలంగాణపై ఉంటుందని, కాంగ్రెస్ గ్యారెంటీల మోసానికి మరాఠ ప్రజలు తగిన బుద్ధిచెప్పారని ఎద్దేవాచేశారు. ఈవీఎంలలో గోల్‌మాల్ జరిగిందని కాంగ్రెస్ ప్రకటించడం హాస్యాస్పదమని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేసిన ఒక్క స్థానంలో కూడా కాంగ్రెస్ కూటమి గెలవలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలు, హామీలు అమలు చేయకపోతే వచ్చే స్థానిక, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఓడించడం ఖాయమన్నారు. రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని మరఠ్వాడ ప్రజలు నమ్మి మరోసారి డబుల్ ఇంజన్ సర్కారును కోరుకున్నారని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆ రాష్ట్రంలో అవినీతి రహిత పాలన, పథకాల అమలు వల్లే మహాయుతి కూటమికి ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, కార్పొరేటర్లు, నాయకులు స్రవంతిరెడ్డి, స్వామి యాదవ్, సంతోష్, కర్క గంగారెడ్డి, లక్ష్మీనారాయణ, పానుగంటి సతీష్‌రెడ్డి, కిషోర్, చుక్క మధు, నక్క రాజేశ్వర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మిఠాయిలు తినిపించుకుంటున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

ఇందిరమ్మ ఇళ్ల పైలట్ ప్రాజెక్టు సర్వే పరిశీలన

- ఆకస్మిక తనిఖీలు చేసిన జిల్లా కలెక్టర్

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని మాదాపూర్‌లో ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పైలట్ ప్రాజెక్టు సర్వేను జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న తీరును గమనించారు. స్వయంగా దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొంత స్థలం కలిగి ఉన్నారా, ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి యజమాని ఎవరు, పాత పెంకుటింట్లో ఉంటున్నారా లేక పక్కా గృహమా తదితర అంశాలను పర్యవేక్షించి ఆన్‌లైన్ నమోదు చేశారు. పక్కాగా వివరాలను సేకరిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు నమోదు చేయాలని స్పిందికి సూచించారు.

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం..

మాదాపూర్ గ్రామ పంచాయతీలోని పోలింగ్ బూత్‌ను కలెక్టర్ సందర్శించారు. రెండో విడత ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని తనిఖీ చేశారు. ఎంత మంది కొత్త ఓటర్లను నమోదు చేశారని సిబ్బందిని అడిగారు. మరణించిన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించారా ? తదితర వివరాలను బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు.18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, జక్రాన్‌పల్లి తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో సతీష్‌కుమార్ తదితరులున్నారు.



మాదాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

కేజీబీవీ, మోడల్ స్కూళ్ల తనిఖీ

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని, మోడల్ స్కూల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డార్మెటరీ,స్టోర్ రూమ్, కిచెన్‌లో వంట సామగ్రి, స్టోర్ రూంలో నిల్వ ఉంచిన సన్న బియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. ఉడకబెట్టిన కోడి గుడ్లను నీటి గిన్నెలో వేసి ఏవైన చెడిపోయినవి ఉన్నాయా అని పరీక్షించారు.



కస్తూర్బాలో విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కనుల పండువగా డోలోత్సవం

- కొనసాగుతున్న కాలభైరవుడి జన్మదినోత్సవాలు
- నేడు రథోత్సవం

రామారెడ్డి: దక్షిణ కాశీగా పేరుగాంచిన ఇసన్నపల్లి(రామారెడ్డి)లోని శ్రీకాల భైరవ స్వామి ఆలయ కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా 72 గంటలుగా నిర్వహిస్తున్న సంతత ధారాభిషేకం శనివారం ఉదయం ముగిసింది. మధ్యాహ్నం స్వామివారి బంగారు విగ్రహాన్ని బ్యాంకునుంచి ఆలయ ఈవో ప్రభుగుప్తా తీసుకువచ్చారు. అనంతరం బంగారు భైరవుడి విగ్రహాన్ని తొట్లిలో ఉంచి భక్తులు లాలి పాటలు పాడారు. ఈ సందర్భంగా భైరవ నామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. డోలోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రథోత్సవానికి ఏర్పాట్లు..

ఉత్సవాలలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించనున్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి ఇసన్నపల్లి, రామారెడ్డి గ్రామాలలో శోభాయాత్ర నిర్వహిస్తారు. రథం తిరిగి ఆలయానికి చేరుకున్న తర్వాత దక్షయజ్ఞం ఏర్పాటు చేస్తారు.



స్వామివారి విగ్రహాన్ని తీసుకువస్తున్న ఈవో ప్రభుగుప్తా

నాగారంలో మహిళా శక్తి భవనం

- రూ.5 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- పంచాయతీరాజ్ శాఖకు నిర్మాణ బాధ్యతలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా స్థాయిలో మహిళా సంఘాలు సమావేశాలు, శిక్షణ తరగతులు నిర్వహించుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకో ఇందిరా మహిళా శక్తి భవనాన్ని నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా నిజామాబాద్ జిల్లాకు కూడా మహిళా శక్తి భవనాన్ని మంజూరు చేసింది. దీని నిర్మాణం కోసం జిల్లా కేంద్రంలోని నాగారంలో ఒక ఎకరం స్థలాన్ని కూగా కేటాయించారు. ప్రస్తుతం రూ.5 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం భవనాన్ని నిర్మించే బాధ్యత పంచాయతీ రాజ్ శాఖకు అప్పగించింది. అధికారులు టెండర్లు పిలిచి త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు. జిల్లాలో మొత్తం 28 మండల సామాఖ్యలు ఉన్నాయి. వీటిని కలుపుకొని జిల్లా సమాఖ్య ఏర్పాటైంది. ప్రతి నెలా మండల సమాఖ్య అధ్యక్షులతో జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహిస్తుంది. మొన్నటి వరకు దూరంగా డిచ్‌పల్లిలో ఉన్న టీటీడీసీ భవనంలో నిర్వహిస్తూ వచ్చారు. మహిళా సంఘాలకు, నిరుద్యోగులకు ఉపాధి నైపుణ్య శిక్షణలు సైతం అక్కడే నిర్వహించేవారు. ప్రస్తుతం కలెక్టరేట్‌లో గ్రామీణాభివృద్ధి శాఖలో విశాలమైన స్థలం ఉండడంతో జిల్లా సమాఖ్య సమావేశాలు ఇక్కడే నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం జిల్లా సమాఖ్యలకు ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మించి ఇవ్వనుండడంతో సమావేశాలు, శిక్షణలకు ఇబ్బందులు తొలగనున్నాయి. నాగారంలోని ఎకరం స్థలంలో రెండంతస్తుల భవనం నిర్మించనుండగా ఇందులో మూడు ఆఫీసు గదులు, సమావేశపు గది, ట్రైనింగ్ రూం, విశ్రాంతి గదులు, క్యాంటీన్, పార్కింగ్ ఏర్పాటు చేసేందుకు ప్లాన్ కూడా సిద్ధం చేసినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ 'సాక్షి'తో తెలిపారు.



నిర్మించబోయే ఇందిరా మహిళా శక్తి భవన నమూనా చిత్రం

క్లుప్తంగా

దరఖాస్తు గడువు పొడిగించాలి



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పట్టాలు అందుకునేందుకు దరఖాస్తు చేసుకునే గడువును పెంచాలని డాక్టరేట్ అసోసియేషన్ ప్రతినిధులు సత్యం, రమేశ్ కోరారు. ఈ మేరకు వారు శనివారం సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. 2013 నుంచి 2024 వరకు యూనివర్సిటీలో చదివిన వారు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఈ నెల 26తో ముగుస్తున్న గడువును మరో 15 రోజుల పాటు పొడిగించాలని కోరారు.

25న చలో తెలంగాణ యూనివర్సిటీ

తెలంగాణ యూనివర్సిటీలో 2013 నుంచి 2024 వరకు చదివిన వారందరికి స్నాతకోత్సవంలో పట్టాలు ఇవ్వాలని ఈ నెల 25న చలో యూనివర్సిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టరేట్ అసోసియేషన్ ప్రతినిధులు సత్యం, రమేశ్ అన్నారు. సౌత్‌క్యాంపస్‌లో విద్యార్థి సంఘాల నేతలతో వారు మాట్లాడారు. స్నాతకోత్సవంలో పట్టాలు ఇచ్చేలా యూనివర్సిటీ అధికారులపై ఒత్తిడి పెంచడానికి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పీజీ పరీక్ష ఫీజు చెల్లించాలి

డిచ్‌పల్లి: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఐదేళ్ల పీజీ ఇంటిగ్రేటెడ్ కోర్స్ పరీక్షల టైం టేబుల్ విడుదల చేసినట్లు కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ కోర్సుల్లో (ఏపీఈ, ఐపీసీహెచ్) ఐదో, ఏడో, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ ఎగ్జామ్, ఐఎంబీఏ, ఎల్ఎల్‌బీ, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు డిసెంబర్ 5 నుండి 16 వరకు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షల ఫీజులను ఈ నెల 28లోగా చెల్లించాలని సూచించారు. అపరాధ రుసుంతో డిసెంబర్ 2 వరకు చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

నేడు గరికిపాటి రాక

బాన్సువాడ : పద్మశ్రీ, సహస్ర అవధాని గరికిపాటి నరసింహారావు ఆదివారం బాన్సువాడ రానున్నారని అయ్యప్ప నిత్యాన్నదాన ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు శంకర్ గురుస్వామి తెలిపారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాట్లను కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. సాయంత్రం 4 గంటలకు గరికిపాటి ప్రవచనం ప్రారంభమవుతుందని, భక్తులు తరలిరావాలని కోరారు.

సేంద్రియ ఎరువుల నిల్వ

- పసుపు సాగు కోసం సిద్ధం చేసుకుంటున్న రైతులు
- తక్కువ ధరకు దొరుకుతుందని ఆలోచన



వెల్కటూర్ వద్ద నిల్వ చేసిన సేంద్రియ ఎరువు

బాల్కొండ: పసుపు రైతులు ముందస్తుగా సేంద్రియ ఎరువులను నిల్వ చేసుకుంటున్నారు. అన్‌సీజన్‌లో పశువుల పేడ తక్కువ ధరకు లభిస్తుందని ఆలోచనలో ముందస్తుగానే పంట భూముల వద్ద నిల్వ చేసుకుంటున్నారు. మెండోరా మండలం వెల్కటూర్ గ్రామంలో రైతులు లారీలకు లారీలు సేంద్రియ ఎరువును నిల్వ చేసుకుంటున్నారు. ప్రస్తుతం లారీ పశువుల పేడ రూ. 18 వేలకు, గొర్రెల పేడ రూ.25 వేలకు లభిస్తుంది. అదే సీజన్‌లో అయితే పశువుల పేడ రూ.21 వేలు, గొర్రెలపేడ రూ.30 వేలకు దొరుకుతుంది. దీంతో రైతులు ముందస్తుగా దిగుమతి చేసుకొని నిల్వ చేసుకోవడంపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం జొన్న పంట సాగు చేస్తున్న నేలల్లోనే వచ్చే ఖరీఫ్‌లో పసుపు సాగుచేస్తారు. ప్రస్తుతం భూములు కూడా ఖాళీగా లేక పోవడంతో ఆ పంట భూముల పక్కన నిల్వ చేసుకుంటున్నారు. దూర ప్రాంతాల నుంచి పశువుల పేడను దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాలోని వర్ని మండలం, ఆదిలాబాద్ జిల్లా నుంచి అధికంగా ఆవుల పేడను, గొర్రెల పేడను దిగుమతి చేసుకుంటున్నారు. కొందరు రైతులు వేసవిలో ఏకంగా ఆవులను పంట భూముల్లో పడుకొబెడుతారు.

ఎకరానికి 4 లారీలు అవసరం

పసుపు పంటను సాగు చేసే నేలల్లో అధికంగా సేంద్రియ ఎరువులను వినియోగిస్తారు. ఎకరానికి 3 నుంచి 4 లారీల పశువుల పేడను వినియోగిస్తున్నారు. దీంతో పాటు నల్ల మట్టిని కూడా రైతులు భూ సారం పెంచుటకు కొట్టిస్తారు. ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర పెట్టుబడి పెట్టి పసుపు సాగు చేస్తారు. వచ్చే ఖరీఫ్‌లో జూన్, జూలై సాగు చేసే పసుపు పంట కోసం ఇప్పటి నుంచే ఎరువులను రైతులు నిల్వ చేసుకుంటున్నారు. .

ధర కలిసి వస్తుందని..

పసుపు సాగు చేసే నేలల్లో ఎక్కువ సేంద్రియ ఎరువును వినియోగిస్తాం. ప్రస్తుతం నిల్వ దిగుమతి చేసుకుంటే ధర కలిసి వస్తుందని ముందస్తుగా పంట భూముల వద్ద ఎరువును నిల్వ చేసుకుంటున్నాం. వేసవిలో ఎరువులు కొనుగోలు చేస్తే ధర ఎక్కువగా ఉంటుంది.

– ముస్కు రాజేశ్వర్, వెల్కటూర్

కుటుంబ నియంత్రణలో పురుషుల భాగస్వామ్యం పెంచాలి

డీఎంహెచ్‌వో రాజశ్రీ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్ నాగారం: కుటుంబ నియంత్రణలో పురుషుల భాగస్వామ్యం పెంచాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. వెసెక్టమి పక్షోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వెసెక్టమి పక్షోత్సవాలను ఈ నెల 21 నుంచి డిసెంబర్ 4 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 27 వరకు మొబిలైజేషన్ కార్యక్రమాలు, ఈ నెల 28 నుంచి డిసెంబర్ 4 వరకు పురుషులకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు కుటుంబ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పురుషులకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ఈ నెల 28న ఆర్మూర్‌లో, 30న డిచ్‌పల్లిలో, డిసెంబర్ 02న మోర్తాడ్‌లో, డిసెంబర్ 4న బోధన్‌లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఈ కార్యక్రమంలో అసంక్రమిక వ్యాధుల ప్రోగ్రాం అధికారి వినీత్‌రెడ్డి, ఏవో చందర్, గణాంకాధికారి రాజేశ్వర్, జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు, డీపీవో విశాల, డీఏవో సందీప్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సమావేశంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

గాడిద తలపై స్కానర్



సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రతి ఒక్కరు స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తున్నారు. ఎక్కడకు వెళ్లిన ఆన్‌లైన్, యూపీఐ పేమెంట్లు చేస్తున్నారు. దీంతో గాడిద పాలు అమ్మే ఓ యువకుడు ఇలా గాడిద తలకు యూపీఐ స్కానర్ ఏర్పాటు చేసుకున్నాడు. నగరంలోని ముబారక్‌నగర్ ప్రాంతంలో గాడిద పాలు విక్రయిస్తున్న ప్రదీప్ అనే యువకుడు గిరాకీ దెబ్బతినకుండా స్కానర్ ఏర్పాటు చేసుకున్నాడు. – నిజామాబాద్ అర్బన్

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా వెంచర్



మానిక్‌భండార్‌లోని వెంచర్

మాక్లూర్: మాక్లూర్ మండలం మానిక్‌భండార్‌లోని ఓ వెంచర్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చీకటి పడగానే గ్యాంగ్‌లుగా యువకులు వెంచర్‌లోకి వచ్చి హంగామా చేస్తున్నారు. తెల్లవారుజామున మూడు గంటల వరకు మద్యం, గంజాయి తాగుతూ అరుస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ నగరానికి ఈ వెంచర్ కూత వేటు దూరంలో ఉంది. సుమారు 300 ఎకరాల్లో నిర్మానుషంగా ఉండటంతో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. వీరి తీరుతో గ్రామ యువకులు చెడిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ వెంచర్‌పై నిఘా పెట్టి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పోలీసులు నిఘా పెట్టాలి

మానిక్‌భండార్ శివారులో ఉన్న వెంచర్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతన్నాయి. చీకటి పడగానే బైక్‌లు, కార్లలో వచ్చి మత్తు పదార్థాలు తాగుతున్నారు. పోలీసులు వెంచర్‌పై నిఘా పెట్టి అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలి.

– శివరాజ్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలి



భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నిజాంసాగర్(జుక్కల్): రోడ్డు విస్తరణ పనుల్లో భూములు కోల్పోతున్న రైతులతో సబ్ కలెక్టర్ కిరణ్మయి శనివారం మాట్లాడారు. పనులకు సహకరించాలని, ప్రభుత్వ పరంగా పరిహారం అందుతుందన్నారు. బూర్గుల్ గ్రామ శివారులో భూముల సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పాత పహానీలు, రికార్డుల ప్రకారంగా ఉన్న భూములకు అనుమతులు ఇస్తామని చెప్పారు. శనివారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం, నవోదయ విద్యాలయంలో ఇంటింటి సర్వే ఆన్‌లైన్ నమోదును సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను మరింత వేగంతం చేయాలని ఆమె సూచించారు. ధాన్యం తుకంతోపాటు బస్తాల రవాణాకు ట్రాన్స్‌పోర్టు ఇబ్బందులు ఎదురుకాకుండా సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. సబ్ కలెక్టర్ వెంట మహమ్మద్‌నగర్ తహసీల్దార్ సవాయిసింగ్, గిర్దావర్ పండరి తదితరులున్నారు.

క్రీడా సమాచారం

ఉమ్మడి జిల్లా స్థాయి హాకీ పోటీలు



కామారెడ్డి టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో అండర్-14 ఉమ్మడి జిల్లా స్థాయి హాకీ పోటీలను శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన వారు ఈ నెల 29న హుజురాబాద్‌లో జరిగే స్టేట్ మీట్‌లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రసూల్, స్వామిగౌడ్, మధుసూదన్, ఆంజనేయులు, లక్ష్మణ్, నాగరాజు, నగేష్, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక




బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపులో గురుకుల బాలికల కళాశాలకు చెందిన విద్యార్థినులు అండర్ 19 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వెన్నెల (బైపీసీ ఫస్టియర్), మృదుల (ఎంపీసీ ఫస్టియర్) పాల్గొంటారు. విద్యార్థులను ప్రిన్సిపల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ సునీత, పీఈటీ సుప్రిత, అధ్యాపకులు అభినందించారు.

28న ఉమ్మడి జిల్లా అర్చరీ పోటీలు

దోమకొండ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాస్థాయి సీనియర్ అర్చరీ పోటీలను దోమకొండలోని గడికోటలో ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఉదయం 8 గంటలకు రిపోర్టు చేయాలని, తమ వెంట పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తెచ్చుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9705141241 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చెరుకు తోట దగ్ధం



సదాశివనగర్‌లో కాలిపోయిన చెరుకు తోట

సదాశివనగర్: సదాశివనగర్‌లో శనివారం ప్రమాదవశాత్తు చెరుకు తోట కాలిపోయింది. గ్రామానికి చెందిన నల్ల రాంరెడ్డి ఎనిమిది ఎకరాలు, పెసరి నారాయణ ఎకరం, పెసరి శేఖర్ ఎకరం చెరుకు తోటతో పాటు డ్రిప్ పైపులు కాలిపోయాయి. కాలిపోయిన చెరుకును ఫ్యాక్టరీ యాజమాన్యం త్వరగా క్రషింగ్‌కు తరలించాలని రైతులు కోరుతున్నారు. ఎకరం విస్తీర్ణంలో కాలిపోయిన డ్రిప్ పైపుల విలువ రూ.40వేల వరకు ఉంటుందని రైతు రాంరెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రాకేశ్(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం పిప్రి గ్రామ శివారులో స్కూటీ బైక్ ఢీకొన్న ఘటన రాచురి రాకేశ్(30) మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపిన వివరాలు.. శనివారం మధ్యాహ్నం బాబు అనే వ్యక్తి స్కూటీపై ఆర్మూర్ వైపు పిప్రి వెళ్తున్నాడు. ఆర్మూర్‌కు చెందిన రాకేశ్ బైక్‌పై పిప్రి నుంచి వస్తుండగా స్కూటీ ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ రాకేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

దోమకొండ: మండలంలోని అంచనూరు శివారులో ఈ నెల 20న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ భిక్కనూరు మండలం జంగంపల్లికి చెందిన శామర్తి రాజనర్సు(75) మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. రాజనర్సు తన కుమారుడు బాల్‌రాజ్‌తో కలిసి జనగామ గ్రామానికి వెళ్లి వస్తుండగా కుక్క అడ్డురాగా కిందపడి గాయపడ్డారు. నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజనర్సు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి..

బీబీపేట: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన యాడారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాడారం గ్రామానికి చెందిన అల్లెపు మల్లయ్య (60) గతంలో నిజామాబాద్‌లో ఉండేవాడు. కొద్ది రోజుల క్రితం గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 22న గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య సాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

అప్పుల బాధతో అటెండర్ ఆత్మహత్య

సదాశివనగర్: అప్పుల బాధతో అటెండర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తండా లింగం(45) తాడ్వాయి తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనకు ముగ్గురు కూతుర్లుగా ఇద్దరి పెళ్లిళ్లు చేశాడు. వారి పెళ్ళిళ్ల కోసం చేసిన అప్పులు తీర్చేదెలా అని మనస్తాపం చెంది గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రంజిత్ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

రెంజల్(బోధన్): బోధన్ మండలంలోని సిద్దాపూర్, మందర్న క్వారీల నుంచి ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సిద్దాపూర్ క్వారీ నుంచి వే బిల్లులో నిజామాబాద్ వరకు ఉందని పేర్కొన్నారు. బోధన్, ఎడపల్లి మండలాల నుంచి నిజామాబాద్‌కు తరలించాల్సి ఉండగా రెంజల్ మండలంలో వీరన్నగుట్ట మీదుగా నవీపేట్‌కు తరలిస్తున్నట్లు డ్రైవర్ చెప్పడంతో స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు.

గంగస్థాన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగస్థాన్-2లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు స్థానికులు శనివారం తెలిపారు. మృతుడి వయసు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయమై వివరణ కోరేందుకు ఎస్‌హెచ్‌వో ఆరీఫ్‌ను సంప్రదించగా స్పందించలేదు.

మెడికల్ షాప్‌లో చోరీ



నిజామాబాద్ రూరల్: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ ఎక్స్ రోడ్డు వద్ద గల మెడిలైఫ్ ఫార్మసీలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాలు.. యజమాని విజయ్ కుమార్ శుక్రవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో పోలీసులకు సమాచారం అందించాడు. షాప్‌లో గల రూ.రెండు లక్షల నగదు చోరీ అయినట్లు బాధితుడు తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కాయిల్స్..



మోర్తాడ్: మోర్తాడ్ శివారులోని వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను దొంగలు ధ్వంసం చేసి అందులోని ఆయిల్, కాపర్ వైర్ చోరీ చేశారు. శనివారం రైతు గోపిడి సత్యనారాయణ గమనించి పోలీసులు, విద్యుత్ ఉద్యోగులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పదంగా ఎవరైనా రాత్రిపూట పొలాల వద్ద కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్సై విక్రమ్ సూచించారు.

ధాన్యం బస్తాలు..

నిజామాబాద్ సిటీ: మోపాల్ మండలంలోని కులాస్‌పూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి మేకల మహిపాల్‌కు చెందిన 18 బస్తాల ధాన్యం బస్తాలు చోరీ అయ్యాయి. మూడు రోజులుగా గ్రామంలో తూకం వేసిన ధాన్యం బస్తాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తున్నారు. ఉల్లెంగ రవికి చెందిన 15 బస్తాలు, నీరడి లక్ష్మీకి చెందిన 18 బస్తాలు, ఇందూరు రవికి చెందిన 10 బస్తాలు చోరీకి గురయ్యాయి. ధాన్యం బస్తాల చోరీపై మోపాల్ ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్‌ను ప్రశ్నించగా తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్నారు. అయినా సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు

- భయంతో ఆత్మహత్య చేసుకున్న మరో నిందితుడు!

భిక్కనూరు: భిక్కనూరు మండలం కంచర్ల గ్రామంలో ఈనెల 20న హత్యకు గురైన మహిళ కేసులో ఒక నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కంచర్ల గ్రామానికి చెందిన సుగుణను హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలను ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు, ఆధ్వర్యంలో సీఐ సంపత్‌కుమార్, ఎస్సై సాయికుమార్ కేసు దర్యాప్తు ప్రారంభించారు. బీబీపేట మండలం యాడారం గ్రామానికి చెందిన ఇద్దరు హత్య చేసినట్లు గుర్తించినట్లు తెలిసింది. ఈ మేరకు ఒక నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి భయంతో పురుగుల మందు తాగినట్లు సమాచారం. కాగా సదరు వ్యక్తి చికిత్స పొందుతూ కామారెడ్డి ఆస్పత్రిలో మృతి చెందినట్లు తెలిసింది.

ప్రభుత్వ భూమి ఆక్రమించిన 13 మందిపై కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని అర్సపల్లిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన 13 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సర్వే నంబర్ 249లో 1,581 గజాలను 14 మంది ఆక్రమించుకున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో నార్త్ తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిలో చౌదరి, హైదర్, సమి, దావూద్, ఇమ్రాన్, ఫయాజ్, ముసలాబ్, ముబీబ్, షేక్ అహ్మద్, హైమద్ మేస్త్రీ, మఫ్తీ సాహెబ్, వాజీద్, ఆజీమ్ ఉన్నారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు 13 మందిపై కేసు నమోదు చేసినప్పటికీ వివరాలను గోప్యంగా ఉంచారు. దీనిపై సౌత్ సీఐ సురేశ్‌ను వివరణ కోరగా 15 రోజుల క్రితం తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెక్‌పోస్ట్ దహనం చేసిన వ్యక్తి అరెస్ట్

రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల శివారులోని రెవెన్యూ చెక్‌పోస్టును కాలబెట్టిన నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రుద్రూర్ సీఐ కృష్ణ, కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. మంజీర నుంచి ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి కొడిచర్ల శివారులో నెల రోజుల క్రితం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ నెల 18న సిబ్బంది లేని సమయంలో దుండగులు చెక్‌పోస్టుకు నిప్పంటించారు. దీనిపై తహసీల్దార్ మల్లయ్య కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన షేక్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడు నేరం అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో..

నవీపేట: నవీపేటలోని దర్యాపూర్ కాలనీలో ఈనెల 18న జరిగిన హత్యాయత్నం కేసులో శనివారం ఒకరిని రిమాండ్ చేసినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని షేక్ సోహేల్‌పై షేక్ గౌస్ కత్తితో దాడి చేశారని పేర్కొన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు గౌస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆర్వోబీ వద్ద ధాన్యం లారీ బోల్తా



నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవనగర్ ఆర్వోబీ వద్ద శనివారం సాయంత్రం ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. అందులోని వడ్ల సంచులు రోడ్డుపై పడిపోయాయి. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం జరగలేదు. లారీ, ధాన్యం బస్తాలు రోడ్డుపై పడటంతో గంట సేపు ట్రాఫిక్ జామ్ అయింది. ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకొని వాహనాలను క్లియర్ చేశారు.

హెగ్డోలి శివారులో ..



రుద్రూర్: పోతంగల్ మండలం హెగ్డోలి శివారులో శనివారం అదుపు తప్పి లారీ బోల్తా పడింది. ధాన్యం బస్తాలు నింపుకొని రావడానికి వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు కల్వర్టులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. కల్వర్టు వద్ద సూచిక బోర్డు లేకపోవడం, ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వడానికి లారీ పక్కకు తీయడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.